నేడు డయల్ యువర్ డీఎం

కాచిగూడ, ఫిబ్రవరి 27: ప్రయాణికుల సమస్యల పరిష్కరించేందుకు నేడు(బుధవారం)మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు బర్కత్‌పుర డిపో మేనేజర్ ఎం. వేణుగోపాల్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్టీసీ ప్రయాణికులు తమ సమస్యలు, సలహాలు పోన్ నం. 9000406069 కు తెలియజేయాలని విజ్ఞప్తి చేశారు.

డీసీపీ గిరిధర్‌కు సన్మానం

ఈస్ట్ జోన్ డీసీపీగా నియమితులైన రావుల గిరిధర్‌ను బజరంగ్ సేన నాయకులు కలిసి అభినందనలు తెలిపారు. సేన రాష్ట్ర అధ్యక్షుడు ఎన్ఆర్ లక్ష్మణ్ రావు, ప్రధాన కార్యదర్శి సూర్య శుక్లా, ఎం మనోజ్, నరేశ్, విజయ్ ముదిరాజ్ తదితరులు గిరిధర్‌ను కలిసి పుష్పగుచ్చాన్ని అందించి శుభాకాంక్షలు తెలిపారు. – అబిడ్స్, ఫిబ్రవరి 27

అర్ధరాత్రి దాటే వరకూ స్నూకర్ పార్లర్.. వ్యక్తి అరెస్ట్

అబిడ్స్, ఫిబ్రవరి 27 అర్ధరాత్రి దాటే వరకు స్నూకర్ పార్లర్ నిర్వహిస్తున్న వ్యక్తికి రెండు రోజుల జైలు శిక్ష విధిస్తూ నాంపల్లి కోర్టు తీర్పు నిచ్చింది. మంగళ్‌హాట్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్ తెలిపిన వివరాలు.. రహీంపురా వద్ద ఉన్న ఎస్‌కే జిమ్‌లో అర్ధరాత్రి వరకూ స్నూకర్ పార్లర్ నిర్వహిస్తున్నట్లు సమాచారం అందడంతో సోమవారం రాత్రి మంగళ్‌హాట్ పోలీసులు దాడిచేసి యజమాని నిఖిల్‌సింగ్‌ను అరెస్ట్ చేశారు. నిందితుడిని మంగళవారం కోర్టులో హాజరు పర్చగా రెండు రోజుల జైలు శిక్ష విధించినట్లు సీఐ తెలిపారు.

ప్రజా సమస్యలు పరిష్కరిస్తాం

మెహిదీపట్నం ఫిబ్రవరి 27: ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించడానికి కృషి చేస్తున్నామని నాంపల్లి ఎమ్మెల్యే మహ్మద్ మాజీద్ హుస్సేన్ అన్నారు. మంగళవారం దారుస్సలాంలో వివిధ డివిజన్ల ప్రజలు ఎమ్మెల్యే మాజీద్ హుస్సేన్‌ను కలిసి సమస్యలను వివరించారు. స్పందించిన ఆయన అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

ఆత్మీయ సమ్మేళనం విజయవంతం

- కష్టపడే కార్యకర్తలకు గుర్తింపు
- ఇచ్చిన హామీలను నెరవేర్చేవరకూ వెంటపడుతాం: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెంకటేశ్, చిత్రంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

కేటీఆర్‌కు గజమాలతో స్వాగతం పలుకుతున్న బీఆర్ఎస్ సీనియర్ నేత ఎడ్ల సుధాకర్‌రెడ్డి

కేటీఆర్‌కు మొక్కను అందజేస్తున్న డివిజన్ అధ్యక్షుడు చంద్రమోహన్

అంబర్‌పేట, ఫిబ్రవరి 27: అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక మహారాణాప్రతాప్ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన బీఆర్ఎస్ విస్తృతస్థాయి కార్యకర్తల(ఆత్మీయ సమ్మేళనం) సమావేశం విజయవంతమైంది. నియోజకవర్గంలోని కాచిగూడ, నల్లకుంట, గోల్నాక, అంబర్‌పేట, బాగ్‌అంబర్‌పేట తదితర డివిజన్ల నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఆత్మీయ సమ్మేళనానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. వివిధ నియోజకవర్గాలకు చెందిన ఎమ్మెల్యేలు ముఠా గోపాల్, బండారి లక్ష్మారెడ్డి, అరికపూడి గాంధీ, మాజీ మంత్రి మహమూద్ అలీ, మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట్రామరెడ్డి, రావుల శ్రీధర్‌రెడ్డి, తలసాని సాయికిరణ్ కూడా సమ్మేళనానికి వచ్చారు. ఈ సమావేశంలో నాయకులు, కార్యకర్తలను కేటీఆర్ ఉత్తేజపరిచారు. పదేండ్ల తెలంగాణ ప్రభుత్వ హయాంలో చేసిన అభివృద్ధిని వివరిస్తూనే కాంగ్రెస్, బీజేపీలను విమర్శించారు. అబద్ధపు 420 హామీలు కాంగ్రెస్ ఇచ్చిందని, మార్చి 17 తర్వాత హామీలు నెరవేర్చకపోతే ప్రజల తరపున కొట్లాడదామని అన్నారు. కిషన్‌రెడ్డి కేంద్రమంత్రిగా ఉండి ఏమీ ఒరగబెట్టలేదని దుయ్యబట్టారు. హైదరాబాద్‌లో కాంగ్రెస్‌కు ఒక్క సీటు ఇవ్వకుండా ప్రజలు మంచి తీర్పు ఇచ్చారని, వారికి శిరస్సు వంచి నమస్కరిస్తున్నానని చెప్పారు. వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో కూడా బీఆర్ఎస్ పట్టు సడలలేదని నిరూపించుకుందామని పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ మాట్లాడుతూ భవిష్యత్తులో నాయకులు, కార్యకర్తలకు మంచి అవకాశాలు కల్పించాలని కోరగా, కమిటీలు, పదవుల్లో తప్పనిసరిగా చోటు కల్పిస్తామని చెప్పారు. అంతకుముందు పార్టీ సీనియర్ నాయకుడు ఎడ్ల సుధాకర్‌రెడ్డి గజమాలతో కేటీఆర్‌ను సత్కరించారు. బాగ్‌అంబర్‌పేట కార్పొరేటర్ బి.పద్మావెంకటరెడ్డి కూడా కేటీఆర్‌ను సన్మానించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు దూసరి లావణ్యశ్రీనివాస్‌గౌడ్, ఇ.విజయ్‌కుమార్ రెడ్డి, మాజీ కార్పొరేటర్లు వనం రమేశ్, కె.పద్మావతిడీపీరెడ్డి, డివిజన్ అధ్యక్షుడు సీహెచ్ చంద్రమోహన్, సిద్ధార్థ్‌ముదిరాజ్, మేడి ప్రసాద్, నాయకులు ఎర్రబోలు నర్సింహారెడ్డి, మధుసూదన్‌రెడ్డి, శ్రీరాములుముదిరాజ్, కవితారావు, భారతిరెడ్డి, పల్లవి, స్వరూప, పద్మజ తదితరులు పాల్గొన్నారు.

అల్పాహారం అందజేత

కవాడిగూడ, ఫిబ్రవరి 27: పది పరీక్షలకు ప్రిపేర్ అయ్యే విద్యార్థులకు అల్పాహారం ఇవ్వడం అభినందనీయమని బీఆర్ఎస్ గ్రేటర్ సీనియర్ నాయకుడు ఎమ్మెన్ శ్రీనివాస్ రావు అన్నారు. మంగళవారం ముషీరాబాద్ ప్రభుత్వ పాఠశాలలో రాజపేట్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పది పరీక్షలకు సమాయతమయ్యే విద్యార్థులకు అల్పాహారాన్ని ఆయన ట్రస్ట్ ప్రతినిధులతో కలిసి పంపిణీ చేశారు. ముషీరాబాద్ ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు స్వరూపరాణి, ఉపాధ్యాయుడు ఎం.నరేందర్‌యాదవ్, జూనియర్ అసిస్టెంట్ రతన్, రాజపేట్ చారిటబుల్ ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి ఆర్. ఆంజనేయులు, ప్రతినిధులు శ్రీనివాస్ పటాలె, బీఆర్ఎస్ నాయకులు గోరేబాయ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి: కార్వాన్ ఎమ్మెల్యే

కార్వాన్, ఫిబ్రవరి 27: కార్వాన్ నియోజకవర్గంలోని ప్రజా సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొయినుద్దీన్ అన్నారు. గుడిమల్కాపూర్‌లోని ఎస్‌బీఐ బ్యాంకు నుంచి అన్నపూర్ణ ఆలయం వరకు ప్రతిరోజూ పొంగుతున్న డ్రైనేజీ సమస్య గురించి స్థానికుల ఫిర్యాదుతో ఆయన మంగళవారం జీహెచ్ ఎంసీ, జలమండలి అధికారులతో కలిసి పర్యటించారు. ఆయన మాట్లాడుతూ సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలని సూచించారు. స్థానిక నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

ప్రజలకు చెత్త కుప్పల కారణంగా ఇబ్బందులు తలెత్తకుండా ఎప్పటికప్పుడూ చెత్తను తరలించడానికి చర్యలు తీసుకుంటున్నామని జీహెచ్ఎంసీ సర్కిల్ –12 డిప్యూటీ కమిషనర్ నాగేశ్వర్‌రావు, ఏఎంఓహెచ్ డాక్టర్ బి.విజయ్‌రామ్మోహన్‌రావు అన్నారు. మంగళవారం నాంపల్లి నియోజకవర్గం మల్లేపల్లి డివిజన్‌లోని నాంపల్లి ఏరియా ఆస్పత్రి ప్రాంతంలో వారు పర్యటించారు. ఎంఐఎం నాయకుడు జాఫర్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

– మెహిదీపట్నం ఫిబ్రవరి 27

'న్యూట్రీషియన్ ఫుడ్‌తో మానసిక ఆరోగ్యం'

పండ్లు, న్యూట్రీషియన్ ఫుడ్ అందజేస్తున్న డాక్టర్ మహేంద్రకుమార్‌రెడ్డి

కవాడిగూడ, ఫిబ్రవరి 27: న్యూట్రీషియన్ ఫుడ్‌తోనే ఆరోగ్యమని డిస్ట్రిక్ట్ 2 గవర్నర్, మానసిక నిపుణుడు డాక్టర్ మహేంద్రకుమార్‌రెడ్డి అన్నారు. మంగళవారం డాక్టర్ హిప్నో కమలా కర్స్ మైండ్ అండ్ పర్సనాలిటీ కేర్, నవభారత లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మానసిక వికలాంగుల స్కూల్‌లో విద్యార్థులకు పండ్లు, న్యూట్రీషియన్ ఫుడ్‌తో పాటు నోట్ పుస్తకాలు అందజేశారు. కార్యక్రమంలో లయన్ అంజయ్య, జోనల్ చైర్‌పర్సన్ లయన్ గోపాలకృష్ణ, అధ్యక్షుడు బెల్లంకొండ విజయ్, పి. స్వరూపారాణి, బి. వనిత, డాక్టర్ హిప్నో పద్మాకమలాకర్ పాల్గొన్నారు.

సేవాభావంతో పనిచేసినప్పుడే గుర్తింపు

వంట సామగ్రి అందజేస్తున్న మహేశ్ అగర్వాల్ తదితరులు

కాచిగూడ, ఫిబ్రవరి 27: సేవాభావంతో పనిచేసినప్పుడే గుర్తింపు వస్తుందని తెలంగాణ గోశాల ఫెడరేషన్ గౌరవ అధ్యక్షుడు మహేశ్ అగర్వాల్ పిలుపునిచ్చారు. తెలంగాణ గోశాల ఫెడరేషన్ ఆధ్వర్యంలో వనవాసీ కల్యాణ పరిషత్ మల్లికార్జున విద్యార్థి వసతి గృహానికి వంట సామగ్రిని మంగళవారం మహేశ్ అగర్వాల్ అందజేశారు. పేదరికంలో మగ్గుతున్న పేదలకు చేయూతనందించడంలో ఎంతో తృప్తి ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ కోశాధికారి ప్రేమ్‌చంద్ మనోజ్, దామోదర్‌శెట్టి, గట్టు అశోక్‌రెడ్డి, మనోహర్, రాజు, భక్తరామ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజలు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్‌మొహినుద్దీన్ అన్నారు. మంగళవారం కార్వాన్ నియోజకవర్గంలోని పలు డివిజన్‌లలోని 79 మంది లబ్ధిదారులకు మంజూరైన షాదీముబారక్, కల్యాణలక్ష్మి చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. నాయకులు వజీ ఉజ్జమా సిద్ధికీ, మజహర్ తదితరులు పాల్గొన్నారు. – మెహిదీపట్నం ఫిబ్రవరి 27

మజ్లిస్ ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రాంతాల్లో అభివృద్ధి శూన్యం

- కేంద్రమంత్రి జి. కిషన్‌రెడ్డి

కార్వాన్ నియోజకవర్గంలో నిర్వహించిన బీజేపీ విజయ సంకల్ప యాత్ర ర్యాలీలో పాల్గొన్న కేంద్ర మంత్రి జి. కిషన్‌రెడ్డి, కార్వాన్ బీజేపీ ఇన్‌చార్జి ఠాకూర్ అమర్‌సింగ్

కార్వాన్, ఫిబ్రవరి 27: మజ్లిస్ పార్టీ ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రాంతాలలో అభివృద్ధి శూన్యమని రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు, కేంద్ర మంత్రి జి కిషన్‌రెడ్డి ఆరోపించారు. గోషామహల్ నియోజకవర్గంలో నిర్వహించిన బీజేపీ విజయ సంకల్ప యాత్రలో ఆయన పాల్గొని ప్రసంగించారు. మజ్లిస్ పార్టీ అమాయక ముస్లింలను మభ్యపెట్టి వారి ఓట్లతో సీట్లను సాధించి అభివృద్ధిని పట్టించుకోవడం లేదని అన్నారు. పాతబస్తీకి మెట్రో రైలు తీసుకురావాలని తమ పార్టీ పోరాటం చేయడం జరిగిందని, అదే విధంగా పాతబస్తీలో అనేక సమస్యలతో ప్రజలు సతమతమవుతున్నారని అన్నారు. హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి బీజేపీ విజయం సాధిస్తే మౌలిక వసతులు కల్పించేందుకు పాటు పడ్తామని తెలిపారు. పురానాపూల్ నుంచి ప్రారంభమైన యాత్ర గోషామహల్ నియోజకవర్గంలోని పలు ప్రాంతాలలో నిర్వహించారు. గోల్కొండ బీజేపీ అధ్యక్షుడు వి.పాండుయాదవ్, బేగంబజార్ కార్పొరేటర్ జి.శంకర్‌యాదవ్, గోషామహల్ కార్పొరేటర్ లాల్‌సింగ్, జాంబాగ్ డివిజన్ కార్పొరేటర్ రాకేశ్ జైస్వాల్, కార్పొరేటర్ డాక్టర్ సురేఖ ఓం ప్రకాశ్ భీప్వ, మంగళ్‌హాట్ కార్పొరేటర్ ఎం. శశికళ కృష్ణ, నాయకులు డి.గోపాల్‌జీ, బంగారు సుధీర్‌కుమార్, వై.కృష్ణ, ఎం.కృష్ణ పాల్గొన్నారు.

కేంద్రంలో మరోసారి అధికారంలోకి రాబోయేది బీజేపీ నేతృత్వంలోని ఎన్‌డీఏ ప్రభుత్వమేనని కేంద్ర మంత్రి జి. కిషన్‌రెడ్డి అన్నారు. బీజేపీ నిర్వహిస్తున్న విజయ సంకల్ప యాత్రలో భాగంగా మంగళవారం కార్వాన్ నియోజకవర్గంలోని గుడిమల్కాపూర్ శివ్‌బాగ్ చౌరస్తా నుంచి విజయ సంకల్ప యాత్ర ముందుకు సాగింది. ఈ కార్యక్రమంలో బీజేపీ గోల్కొండ జిల్లా అధ్యక్షుడు ఉప్కెల పాండు యాదవ్, కార్వాన్ ఇన్‌చార్జి టి. అమర్ సింగ్‌తో పాటు బండారు రాధిక, డిజ్వర్‌సింగ్, గోవర్ధన్, బోడి అన్నూయాదవ్, అనీల్, దేవర వంశీ పాల్గొన్నారు.

కార్వాన్‌లో నిర్వహించిన విజయ సంకల్ప యాత్రకు ముందు స్థానిక దాదావాడి జైన్ మందిర్‌లో కేంద్ర మంత్రి జి. కిషన్‌రెడ్డి తన పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి విలేఖరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. బీజేపీ ప్రభుత్వం ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పరిపాలన సాగిస్తుందని అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ దేశంలో ప్రజలకు కావాల్సిన మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. దేశాన్ని ఆర్థికంగా బలోపేతం చేసి ప్రపంచ దేశాలకు పోటీగా నిలిపిన ఘనత బీజేపీదేనన్నారు.

మాజీ మంత్రి శివ శంకర్ వర్ధంతి

శివశంకర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీసీ సంఘం ప్రతినిధులు

కవాడిగూడ, ఫిబ్రవరి 27: బీసీలకు న్యాయ వ్యవస్థలో రిజర్వేషన్‌లు సాధించి న్యాయ శిఖరంగా శివశంకర్ వెలుగొందారని పలువురు కొనియాడారు. ఈ మేరకు మంగళవారం దోమలగూడలోని లిబర్టీలో గల బీసీ సంక్షేమ సంఘం కార్యాలయంలో వెనకబడిన తరగతుల అభ్యున్నతికి కృషి చేసిన ప్రముఖ న్యాయవాది, కేంద్ర మాజీ మంత్రి పుంజాల శివశంకర్ 7వ వర్ధంతి జరిగింది. ఈ సందర్భంగా శివశంకర్ కుమారుడు డాక్టర్ వినయ్‌కుమార్, బీసీ సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు, సీనియర్ పాత్రికేయుడు దుర్గం రవీందర్‌పటేల్, మున్నూరు కాపు సంక్షేమ సంఘం తెలంగాణ రాష్ట్ర అపెక్స్ కౌన్సిల్ కన్వీనర్ సర్దార్ పుటం పురుషోత్తం రావు హాజరై ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు మేకపోతుల నరేందర్‌గౌడ్, బీసీ హిందూ మహాసభ అధ్యక్షుడు బత్తుల సిద్ధేశ్వర్ పటేల్ పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలంలో అక్రమ నిర్మాణాలపై కేంద్రమంత్రికి ఫిర్యాదు

కార్వాన్, ఫిబ్రవరి 27: తాళ్లగడ్డలోని ప్రధాన రోడ్డులో ఉన్న ప్రభుత్వ భూమిలో కొందరు నాయకులు అక్రమ నిర్మాణాలు చేపట్టి స్థలాన్ని కబ్జా చేశారంటూ స్థానిక బీజేపీ నాయకుడు జి. శివ్‌రాజ్‌యాదవ్ మంగళవారం కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. ఆయన మాట్లాడుతూ ఈ స్థలంలో నిర్మాణాలు చేపట్టగా అప్పటి ఆసిఫ్‌నగర్ రెవెన్యూ అధికారులు నిర్మాణాలను కూల్చి ప్రభుత్వ భూమిగా పేర్కొంటూ బోర్డును ఏర్పాటు చేశారన్నారు. ఆరు నెలల నుంచి స్థలం చదును చేయడంతో పాటు నిర్మాణాలు చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆసిఫ్‌నగర్ రెవెన్యూ అధికారులకు ప్రభుత్వ స్థలం కబ్జా గురించి తెలిసినప్పటికీ, తాసీల్దార్ ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం పట్ల ఆయన అనుమానాలు వ్యక్తం చేశారు. ఇదే విషయమై తాను జిల్లా కలెక్టర్, ఆర్‌డీఓకు కూడా ఫిర్యాదు చేసినట్లు శివ్‌రాజ్ యాదవ్ తెలిపారు.

పేదలకు నిత్యావసర సరుకులు పంపిణీ

నిత్యావసర సరుకులను పంపిణీ చేస్తున్న ట్రస్ట్ ప్రతినిధులు బిజ్జి కనకేశ్ కుమార్

కవాడిగూడ, ఫిబ్రవరి 27: భోలక్‌పూర్ డివిజన్‌లోని మహాత్మానగర్‌లో మంగళవారం శ్రీ సత్యసాయిబాబా ట్రస్ట్ గాంధీనగర్ బ్రాంచ్ ఆధ్వర్యంలో పేదలకు నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. 2012 సంవత్సరం నుంచి 30 మందికి ప్రతినెలా 5 కేజీల బియ్యంతో పాటు నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్నట్లు ట్రస్ట్ ప్రతినిధులు సీతారామరాజు, రాజగోపాల్, మదన్ మెహన్, విజయలక్ష్మి బిజ్జి కనకేష్ కుమార్ తెలిపారు.

ప్రతిభతో ఉద్యోగాలు

చిక్కడపల్లి, ఫిబ్రవరి 27 : బాగ్‌లింగంపల్లిలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కళాశాలలో ప్లేస్‌మెంట్ ట్రైనింగ్ విభాగం ఆధ్వర్యంలో మంగళవారం డిగ్రీ ఫైనల్ ఇయర్ విద్యార్థులకు ప్లేస్‌మెంట్ డ్రైవ్‌ను నిర్వహించారు. కళాశాల డైరెక్టర్, కేరీర్ డెవెలప్‌మెంట్ సెల్ విభాగం అధిపతి చాగంటి శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థులకు ఉద్యోగాల కోసం 8 కంపెనీలతో ప్లేస్‌మెంట్ డ్రైవ్‌ను నిర్వహిస్తామని వివరించారు. కార్యక్రమంలో ఎఫ్ఏబీ సర్వీసెస్ హెచ్ఆర్ హెడ్ రాజ్‌కుమార్, మణికంఠ, ప్రిన్సిపాల్ శేఖర్ పాల్గొన్నారు.

డ్రైనేజీ నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలి

డ్రైనేజీ పనులను చేయిస్తున్న కార్పొరేటర్ ఉమ

కవాడిగూడ, ఫిబ్రవరి 27: డివిజన్‌లో జరుగుతున్న డ్రైనేజీ నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజల ఇబ్బందులను తొలగించాలని కవాడిగూడ కార్పొరేటర్ గోడ్చల రచశ్రీ అధికారులను కోరారు. మంగళవారం డివిజన్‌లోని తాళ్లబస్తీలో నూతనంగా నిర్మిస్తున్న డ్రైనేజీ నిర్మాణ పనులను జలమండలి మేనేజర్ శ్రీధర్, వర్క్‌ఇన్‌స్పెక్టర్ విజయ్‌తో కలిసి ఆమె పరిశీలించారు. బీజేపీ రాష్ట్ర నేతలు వెంకటేశ్, డివిజన్ ప్రధాన కార్యదర్శి ప్రభాకర్, బస్తీవాసులు, వాటర్ వర్క్స్ సిబ్బంది పాల్గొన్నారు.

డివిజన్ అభివృద్ధికి కృషి చేస్తా

కాచిగూడ: డివిజన్‌లోని చెప్పల్‌బజార్ ప్రాంతాల్లో కాచిగూడ కార్పొరేటర్ ఉమా యాదవ్ పర్యటించారు. ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా డ్రైనేజీ పనులను త్వరగా పూర్తి చేయాలని జలమండలి అధికారులకు సూచించారు. జలమండలి అధికారులు ఏఈ భావన, వెంకటేశ్‌యాదవ్, రమేశ్‌యాదవ్, భీంరాజ్, ఆర్.సంతోష్, సూలం రవియాదవ్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపై డ్రైనేజీ పరుగులు.. పట్టించుకోని అధికారులు

నడి రోడ్డుపై పారుతున్న డ్రైనేజీ

కాచిగూడ, ఫిబ్రవరి 27: తిలక్‌నగర్ మెయిన్ రోడ్డులోని మహేశ్‌పాన్ షాప్‌లైన్‌లో 15 రోజులుగా రోడ్డుపైనే డ్రైనేజీ నీరు పొంగిపొర్లుతున్నా అధికారులు పట్టించుకోవడంలేదని స్థానికులు, వ్యాపారస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆ దారిగుండా వెళ్లే వాహనదారులకు దుర్వాసనతో అనేక ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. అనేకమార్లు ఆధికారులకు విన్నవించినా పట్టించుకునే నాథుడు లేడని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తిలక్‌నగర్ మెయిన్ రోడ్డుపై పొంగిపొర్లుతున్న డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని వారు కోరుతున్నారు.

యువకుడు అదృశ్యం..

మెహిదీపట్నం, ఫిబ్రవరి 27: ఇంటినుంచి బయటకు వెళ్లిన 17 సంవత్సరాల యువకుడు కనిపించకుండా పోయిన ఘటన మాసాబ్‌ట్యాంక్ పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మాసబ్‌ట్యాంక్‌లో నివసించే షేక్ ఇబ్రహీం కుమారుడు షేక్ అవాయిస్ (17) మంగళవారం సాయంత్రం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తులో ఉంది.

జర్నలిస్టుల ఇండ్ల స్థలాల సమస్య పరిష్కారానికి కృషి

- ప్రొఫెసర్ కోదండరాం

సమావేశంలో పాల్గొని మాట్లాడుతున్న ప్రొఫెసర్ కోదండరాం

ముషీరాబాద్, ఫిబ్రవరి 27: జర్నలిస్టుల ఇండ్ల స్థలాల సమస్యను సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. చాలా కాలంగా జర్నలిస్టులకు ఇండ్ల స్థలాల కేటాయింపు అంశం వాయిదా పడుతుందని, ఈ విషయంపై త్వరలోనే సీఎంను కలిసి చర్చించనున్నట్లు తెలిపారు. మంగళవారం గ్రేటర్ హైదరాబాద్ జర్నలిస్ట్ మ్యూచువల్లీ ఎయిడెడ్ కో–ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ సర్వసభ్య సమావేశం చిక్కడపల్లి త్యాగరాయగానసభలో జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న కోదండరాం మాట్లాడుతూ.. కాంగ్రెస్ జర్నలిస్టుల సమస్యల పట్ల ప్రభుత్వం సానుకూలంగా ఉందని, అర్హులైన వారికి ఇండ్ల స్థలాలు ఇప్పించడానికి కృషి చేస్తానన్నారు. ప్రత్యేక తెలంగాణ సాధనలో జర్నలిస్టుల పాత్ర ఎంతో కీలకంగా నిలిచిందన్నారు. హైదరాబాద్ జిల్లా సహకార శాఖ అధికారి డి.రమాదేవి మాట్లాడుతూ.. తమ శాఖ తరపున జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి సంపూర్ణ సహకారం అందిస్తామన్నారు. సొసైటీ అధ్యక్షుడు మామిడి సోమయ్య అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జనసమితి నగర అధ్యక్షుడు ఎం.నర్స య్య, ప్రతినిధులు పులిపలుపుల ఆనందం, బొల్లం శ్రీనివాస్, రాంచందర్, రామారావు, భాస్కర్‌రెడ్డి, వీరేశం, షోయబుల్లా ఖాన్, బీఆర్‌కె మూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఇండ్లు కోల్పోయిన బాధితులకు అండగా ఉంటాం

చిక్కడపల్లి, ఫిబ్రవరి 27: ఇండ్లు కోల్పోయిన దళిత కుటుంబాలకు న్యాయం జరిగే వరకు అండగా ఉంటానని తెలంగాణ జన సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు ప్రొఫెసర్ ఎం. కోదండరాం అన్నారు. గాంధీనగర్ డివిజన్ శ్రీ స్వామి వివేకానందనగర్ బస్తీలో గత నెల 29వ తేదీన అధికారులు అక్రమంగా 21 ఇండ్లు కూల్చడంతో.. బాధితులు చేప్పటిన నిరసన దీక్ష 29వ రోజుకు చేరుకుంది. మంగళవారం బాధితులు చేప్పటిన నిరసన దీక్షకు కోదండరాం సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ జన సమితి అధ్యక్షుడు ఎం. నర్సయ్య, మెరుగు శ్రీనివాస్‌యాదవ్, ముషీరాబాద్ కన్వీనర్ రవీందర్ యాదవ్ పాల్గొన్నారు.

రహదారిని మూసివేసి.. స్థలం కబ్జాకు యత్నం

జోషివాడి వద్ద మూసివేసిన రోడ్డు

కార్వాన్, ఫిబ్రవరి 27: కార్వాన్‌లోని జోషివాడి కాంప్లెక్స్ వాసులు ప్రతి రోజు నడిచే దారిని కొందరు భూ కబ్జాదారులు తమ వశం చేసుకొని కబ్జా చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. అయితే విషయం గమనించిన స్థానికులు వెంటనే స్థానిక టప్పాచబుత్రా పోలీసులకు, ఆసిఫ్‌నగర్ తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. వివరాలలోకి వెళితే గత 30 ఏండ్ల క్రితం జోషివాడిలో నివసించే పేద ప్రజల కోసం అప్పటి ప్రభుత్వం మురికి వాడగా ఉన్న ఈ ప్రాంతంలో మూడు అంతస్తుల భవనాలు నిర్మించి జోషివాడి కాంప్లెక్స్‌గా నామకరణం చేసింది. అయితే ఈ కాంపెక్స్‌కు వెనుక వైపు ఉన్న దారిని కాంపెక్స్‌లో నివసించే ప్రజలు నడకదారిగా ఉపయోగిస్తున్నారు. అయితే ఈ దారిని మూసివేయడం వల్ల దాదాపు 400 గజాల స్థలం కబ్జా చేసి సొమ్ము చేసుకోచ్చనే ఉద్దేశంతో కొందరు వ్యక్తులు గత మూడు రోజులుగా తమ ప్రణాళికను అమలు చేస్తూ స్థానికులు నడవకుండా దారిని మూసివేస్తూ గనేట్ రాళ్లతో నిర్మాణాలు చేపట్టి దారిని మూసేశారు. ఇదేంటని ప్రశ్నించిన స్థానికులపై బెదిరింపులకు దిగారు. దీంతో చేసేది లేక స్థానికులు పోలీసులు, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. తమకు ప్రభుత్వం న్యాయం చేయాలని కోరారు.

BEFORE